# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 222
పేజీలు : 08 | వెల: రూ.5/-

మంగళవారం
జూన్ 03, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




6లో..

## కన్నీరు పెట్టిన యశస్విని రెడ్డి

- ఇందిరమ్మ పట్టాల పంపిణీలో భావోద్వేగానికి లోనైన ఎమ్మెల్యే
- బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యమంటూ మండిపాటు



## మేడారంలో శాశ్వత పనులు

- అన్ని శాఖలు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి
- భారీ వర్షాల కారణంగా ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలి
- సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సులు నిర్వహించాలి
- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క

8లో..



# కరోనా.. కలకలం?



వరంగల్ మహా నగరంలో మరో మారు కరోనా కలకలం రేపుతోంది. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆరుగురికి కరోనా పాజిటివ్ వచ్చినట్లు తెలుస్తోంది. తీవ్రమైన దగ్గు, జలుబు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి కరోనా పరీక్షలు నిర్వహించగా పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు ప్రచారం సాగుతోంది. తాజా పరిణామంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అలర్టయ్యారు. ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టారు. సాధారణంగా దగ్గు, జలుబుతో ఇబ్బందులు పడుతున్న వారికి కరోనా పరీక్షలు నిర్వహించడం సర్వసాధారణం అంటున్నారు. అయినంత మాత్రాన కరోనా వచ్చినట్లు కాదంటున్నారు. సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న ప్రచారంపై మండి పడుతున్నారు. ఇప్పటి వరకు వరంగల్ లో పాజిటివ్ కేసులు నిర్ధారణ కాలేదంటున్నారు. అయితే దేశ వ్యాప్తంగా కరోనా కేసులు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన నెలకొంది. కాగా కరోనా వేరియంట్ ప్రమాదకరమైనది కానప్పటికీ ప్రజలు అప్రమత్తంగా ఉంటూ కరోనా మహమ్మారిని తరిమి కొట్టాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సూచిస్తున్నారు.

- వరంగల్ వాయిస్, వరంగల్

వివరాలు 2లో..

- నగరంలో ఆరుగురికి పాజిటివ్
- ఎంజీఎం సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షలు
- అలర్టయిన వైద్య ఆరోగ్య శాఖ
- తప్పుడు ప్రచారం అంటూ ఫైర్
- దేశ వ్యాప్తంగా పెరుగుతున్న కేసులు
- ఆందోళనలో జనం



## రెడ్యానాయక్ పై కేసు నమోదు

### మరో 17 మందిపై కూడా..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున ఎలాంటి అనుమతులు లేకుండా ర్యాలీ నిర్వహించడంతోపాటు పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం, వారి మాటలను లెక్క చేయకుండా ర్యాలీ నిర్వహించి లా అండ్ ఆర్డర్ కు విఘాతం కలిగించినందుకు డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ పై కేసు నమోదు చేశారు. సోమవారం డోర్నకల్ లో రెడ్యా నాయక్ ర్యాలీ నిర్వహించడంతోపాటు పోలీసులకు హెచ్చరికలు చేస్తూ ప్రసంగించిన విషయం తెలిసిందే. దీంతో రెడ్యానాయక్ తో పాటు మరో 17 మందిపై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ రాజేష్ నాయక్ తెలిపారు.

– వరంగల్ వాయిస్, డోర్నకల్



2లో..

## ప్రధాని మోదీకి ట్రంప్ బాస్

- పెట్టుబడిదారులకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం
- దేశ సంపద కార్పొరేట్ శక్తుల్లో కేంద్రీకృతం
- సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- నర్మెటలో ఘనంగా జిల్లా 4వ మహాసభలు

# కరోనా.. కలకలం..?




- నగరంలో ఆరుగురికి పాజిటివ్
- ఎంజీఎం సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షలు
- అలర్టయిన వైద్య ఆరోగ్య శాఖ
- తప్పుడు ప్రచారం అంటూ ఫైర్
- దేశ వ్యాప్తంగా పెరుగుతున్న కేసులు
- ఆందోళనలో జనం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** అయిదేండ్ల క్రితం ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా మహమ్మారి మరో మారు తన ప్రతాపాన్ని చూపిస్తోంది. వారం రోజుల్లోనే ప్రపంచ వ్యాప్తంగా 74,645 పాజిటివ్ కేసులు నమోదుకాగా భారత్ లో వీటి సంఖ్య 4,026 కు చేరాయి. అయితే విదేశాలకు నిత్యం రాకపోకలు సాగించే భారత్ లోని పలు రాష్ట్రాల్లోనే పాజిటివ్ కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి. కేరళ, మహారాష్ట్రల్లో అత్యధికంగా కేసులు నమోదు అయినట్లు అధికారిక వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ లో 28, తెలంగాణలో 4 కేసులే నమోదైనప్పటికీ దేశ వ్యప్తంగా కరోనాతో మృతి చెందిన వారి సంఖ్య 37కు చేరింది. మృతుల్లో అత్యధికులు వృద్ధులే కావడం గమనార్హం. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. వైరస్ వ్యాప్తిని అరికట్టే చర్యలకు శ్రీకారం చుట్టాయి. బాధితులకు మెడికల్ టెస్టులు, ఐసోలేషన్ సెంటర్ల ఏర్పాటుకు వేగవంతంగా చర్యలు చేపట్టాయి.

### దక్షిణాదిలోనే ఎక్కువ..

కేంద్ర ఆరోగ్య శాఖ అధికారుల లెక్కల ప్రకారం దేశ వ్యాప్తంగా కరోనా వైరస్ కేసుల సంఖ్య 4,026కు చేరింది. అయితే కేరళ అత్యధికంగా 1,416 కేసులతో అగ్రస్థానంలో ఉండగా మహారాష్ట్ర 494 కేసులతో ద్వితీయ స్థానంలో నిలిచాయి. అయితే మంగళవారం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన బులిటెన్ ప్రకారం గుజరాత్ లో 397, ఢిల్లీలో 393, పశ్చిమ బెంగాళ్ లో 373, కర్ణాటకలో 311, తమిళనాడులో 215, ఉత్తర ప్రదేశ్ లో 138, రాజస్థాన్ లో 75, హర్యానాలో 44, ఆంధ్రప్రదేశ్ లో 28, పుదుచ్చేరిలో 27, మధ్యప్రదేశ్ లో 21, ఒడిశాలో 16, బీహార్ లో 11, ఛత్తీస్ గఢ్ లో 11, జార్ఖండ్ లో 11, కశ్మీర్ లో తొమ్మిది, గోవాలో ఎనిమిది, అస్సోంలో ఆరు, తెలంగాణ లో నాలుగు, అరుణాచల్ ప్రదేశ్ లో మూడు, చండీగఢ్ లో రెండు కేసులు నమోదయ్యాయి.


వరంగల్ వాయిస్, ఫైల్ ఫోటో

### ఆందోళన వద్దు..

ఎన్బీ1.8.1 వేరియంట్ ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. అయితే దీని తీవ్రత తక్కువనే ప్రకటిస్తున్నారు. పలు దేశాల్లో కేసుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతున్నప్పటికీ గత వేరియంట్లతో పోల్చితే తీవ్ర అనారోగ్యాన్ని కలిగించినట్లు ఆధారాలు లేవు. జన్యు పరిణామ క్రమంలో అన్ని ఒమిక్రాన్ ఉప వేరియంట్ల మాదిరిగానే తెలినట్లు ఐసీఎంఆర్ వెల్లడించింది. రెండు, మూడు వారాల పాటు వేరియంట్ ప్రభావం చూపించి తర్వాత కేసులు తగ్గుముఖం పట్టవచ్చని భావిస్తున్నారు. ప్రజలు అప్రమత్తత పాటిస్తే సరిపోతుందంటున్నారు. అయితే రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు మాత్రం ముందు జాగ్రత్త చర్యలు తప్పకుండా చేపట్టాలని డాక్టర్లు సూచిస్తున్నారు. జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి లక్షణాలు కనిపిస్తే ఇంటిలో విడిగా ఉండాలని, వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని చెబుతున్నారు. రుచి, వాసనలను కోల్పోవడం, వాటిని గుర్తించే సామర్థ్యం తగ్గడం, చలి, కండరాల నొప్పులు, ఆకలి మందగించడం లక్షణాలు ఉన్నవారు కరోనా టెస్ట్ చేయించుకోవడం ఉత్తమమంటున్నారు. అదే విధంగా తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

### అందులో నిజం లేదు : డీఎంహెచ్ఓ సాంబశివరావు

వరంగల్ నగరంలో ఆరుగురికి కరోనా పాజిటివ్ సోకినట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో ఎక్కడ కూడా కరోనా కేసులు నిర్ధారణ కాలేదన్నారు. ఈ మేరకు ఒక ప్రకటణ విడుదల చేశారు. దేశ వ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తోందన్నారు. తప్పుడు ప్రచారాలను నమ్మవద్దంటున్నారు.



# ఐఐటీ విద్యార్థులకు సన్మానం

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** జేఈఈ అడ్వాన్డ్స్ 2025 ఫలితాల్లో యాకుబ్‌పూర్ ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ కళాశాలకు చెందిన భూక్య రాహుల్ ఆల్ ఇండియా స్థాయిలో 124వ ర్యాంకు సాధించగా కె.వంశీ కుమార్ 1,689, ఎం.ఈశ్వర్ 2,066 ర్యాంకులను సాధించారు. ప్రిపరేటరీ ఐఐటీ ర్యాంకుల్లో ఎం.వినయ్ కుమార్ 228, భూక్య వీరన్న 683, మాలోతు రాకేష్ 1,134 ర్యాంకులను పొందారు. విజేతలను మంగళవారం పీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, కాలేజ్ ప్రిన్సిపల్ బి.మధు శాలువాలతో సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు బి.వెంకటేశ్వర్లు, టి.రిషికేష్, కె.సదానందం, మహేందర్, రాజన్న, జేఎస్ ప్రసాద్, సంపత్, అమీర్ తదితరులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.



# గోవిందరాజస్వామి గుట్ట పరిసరాల పరిశీలన

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ పట్టణంలోని చారిత్రాత్మక గోవిందరాజస్వామి గుట్ట దేవస్థానం అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సూచన మేరకు ఆలయ కార్యనిర్వాహణ అధికారి మిట్టపల్లి భాస్కర్ నేతృత్వంలో ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ధార్మిక ముఖ్య సలహాదారు ఆర్.గోవిందా హరి, స్తపతి వల్లి నాయకం, ఎస్ఈ దుర్గ ప్రసాద్, అసిస్టెంట్ స్తపతి గణేష్, వర్క్ ఇన్స్పెక్టర్ సునీల్ ఆలయ పరిసరాలను పరిశీలించారు. అభివృద్ధి పనుల ప్రణాళిక కోసం స్థల పరిశీలన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు గూడ శారద, ఎక్స్-అఫీషియో సభ్యులు దౌడ నాగరాజు, వారియోగుల లక్ష్మణ స్వామి, స్థానిక కార్పొరేటర్ అనిల్, అలాగే అర్చకులు వారియోగుల ప్రసాద్ స్వామి, మురళీ స్వామి, వేణు స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీకి ట్రంప్ బాస్



- పెట్టుబడిదారులకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం
- దేశ సంపద కార్పొరేట్ శక్తుల్లో కేంద్రీకృతం
- సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- నర్మెటలో ఘనంగా జిల్లా 4వ మహాసభలు

**వరంగల్ వాయిస్, నర్మెట :** భారత ప్రధాని నరేంద్ర మోదీకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బాస్ అని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. పెట్టబడి దారులకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం అన్నారు. మంగళవారం జనగాం జిల్లా సీపీఐ 4వ మహాసభలు నర్మెట్టలో ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా జనగామ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభ కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిథగా హాజరై మాట్లాడారు. దేశంలో కార్పొరేట్, పెట్టుబడి దారులకు మోదీ ప్రభుత్వం ప్రజల సంపదను ధారాదత్తం చేస్తూ ప్రజల సంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. రానున్న రోజుల్లో పెట్టబడి దారులకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయంగా నిలుస్తారన్నారు. పదేళ్లలో దేశంలో తలసరి ఆదాయం రెట్టింపు అయితే ఆకలి చావులు, రైతుల ఆత్మహత్యలు ఎందుకు ఆపలేక పోయారని ప్రశ్నించారు. మోదీ పాలనలో సంపద అంతా కార్పొరేట్ శక్తులైన అంబానీ, ఆదానీల వద్దే కేంద్రీకృతం అయిందని, అందుకే పేదల బతుకుల్లో మార్పులు రాలేదన్నారు. మోదీ దృష్టి అంతా కార్పొరేట్ శక్తులపైనే ఉండడంతో పేదల సంక్షేమాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషించిన బీజేపీ యుద్ధోన్మాదానికి తెరలేపిందని, మతోన్మాదులు, యుద్ధోన్మాదులతో దేశానికి ప్రమాదకరం అని అన్నారు.

### జిల్లా సమగ్రాభివృద్ధికి సమరశీల పోరాటాలు : తక్కళ్లపల్లి

జిల్లా సమగ్రాభివృద్ధికై సీపీఐ రాజీలేని ప్రజాపోరాటాలు నిర్వహిస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. రెండు సంవత్సరాల క్రితం కాజీపేటలో ప్రధాని మోదీ శంఖుస్థాపన చేసిన కోచ్ ఫ్యాక్టరీకి నేటివరకు అనుమతి లభించలేదని ఆరోపించారు. తెలంగాణపై మోదీ ప్రభుత్వానిది సవతి తల్లి ప్రేమ అన్నారు. జిల్లాలో ఎన్నో ఏళ్లుగా గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. తొలుత నర్మెట్ట మండల కేంద్రంలో సీపీఐ మహాసభల సందర్భంగా భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన, బహిరంగ సభలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్,చొప్పరి సోమయ్య, కావటి యాదగిరి, జువారి రమేష్, పాతూరి రమేష్, జీడి ఎల్లయ్య, బోనగిరి కుమారస్వామి, నీల కనకయ్య, చామకుర యాకుబ్, మోతె శ్రీశైలం, గుగులోతు సఖి, సముద్రాల రాజు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యాత్మక రోడ్లన్నీ పూర్తి చేస్తున్నాం

● ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నియోజకవర్గంలో సమస్యాత్మకమైన రోడ్లను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి ఉంచామని, వర్షాకాలంలో ప్రధాన అంతర్గత రోడ్ల పనులను త్వరగతిన చేపడుతున్న వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం 53వ డివిజన్ విజయ గణపతి కాలనీ, మహాత్మా నగర్, హన్మంత రావు నగర్ లలో రూ.85 లక్షలతో, 54వ డివిజన్ నగర కాలనీలో రూ.33 లక్షలతో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడిచిన 16 నెలలుగా నగరంలో ఉన్న ప్రధాన అంతర్గత రోడ్లను పూర్తి చేసుకున్నామన్నారు.ఎన్నికలలో ఈ డివిజన్ లలో తిరిగిన తరుణంలో ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని తెలిపారు. రెండు డివిజన్లలో మంగళవారం 1.05 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. సంబంధిత అధికారులు నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. నగర అభివృద్ధి,పరిశుభ్రత పట్ల రాష్ట్ర ప్రభుత్వం జూన్ 02 నుంచి సెప్టెంబర్ 10 వరకు చేపట్టిన 100 రోజుల అభివృద్ధి ప్రణాళిక, పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం, సహకారం కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం హన్మంతరావు నగర్ లో ఉన్న ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమం చేసి, దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# యువత నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

● ఫాదర్ ఇన్నారెడ్డి



**వరంగల్ వాయిస్, కాజీపేట :** ఈనెల 1 నుండి 3 వరకు వరకు మూడు రోజుల పాటు ఇండియన్ సోషల్ ఇన్స్టిట్యూట్ బెంగళూరు వారి సహకారంతో తెలంగాణ ఇంచార్జి కరుణ రావు సారథ్యంలో లోడీ సాంఘిక సేవా సంస్థ ఫాతిమా నగర్ లో వ్యక్తిత్వ నైపుణ్యాల శిక్షణ కార్యక్రమాన్ని "బలహీనతలను అర్థం చేసుకోవడం,యు తగ్గించడం" అనే అంశంపై గ్రామీణ, పట్టణ ప్రాంత యువతకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో లోడీ సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ ఫాదర్ ఇన్నారెడ్డి , ఎఫ్ఎంఎం సొసైటీ డైరెక్టర్ సిస్టర్ సహాయ, రికార్డ్ సర్వీసెస్ సొసైటీ అధ్యక్షులు కుసుమ సురేష్, సిరి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు పి.సుధాకర్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు రోజుల పాటు వివిధ అంశాలపై వక్తలు డాక్టర్ గోపిక రాణి, చంద్రమౌళి కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకులు, పద్మ కాకతీయ యూనివర్సిటీ న్యాయ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ నేటి సమాజంలో యువత పెంపొందించుకోవలసిన వ్యక్తిత్వం నైపుణ్యాల గురించి, రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతల గురించి వివరించారు. ఈ కార్యక్రమాన్ని లోడీ సాంఘిక సేవా సంస్థ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎల్. వీరబాబు పర్యవేక్షించగా హనుమకొండ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి 35 మంది యువత పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**వరంగల్ వాయిస్, ఏటూరునాగారం:** కన్నాయిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా వర్కర్లతో నిర్వహించిన సమావేశాన్ని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అభినవ్ నేతృత్వం వహించారు. ఈ సమావేశంలో ఆయన కుటుంబ నియంత్రణ పద్ధతులు, వర్షాకాలంలో అధికంగా కనిపించే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో ఎక్కువగా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, హైరిస్క్ ఏరియాల్లో నివసిస్తున్న గర్భవతులను గుర్తించి జూన్, జూలై, ఆగస్టు నెలల్లో ముందుగా లిస్టు తయారుచేసి, అవసరమైతే ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే, ప్రతి రోజూ డ్రై డే పాటించడం, మలేరియా వంటి రోగాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన తెలిపారు. గాలి ద్వారా, కీటకాల ద్వారా వచ్చే వ్యాధుల నుంచి రక్షణ కోసం 2 సంవత్సరాల లోపు చిన్న పిల్లలు, 65 సంవత్సరాల పైబడిన వృద్ధులు, క్యాన్సర్, టీబీ, డయాబెటిస్, హైపర్‌టెన్షన్ వంటి జబ్బులు ఉన్న వ్యక్తులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ప్రతి రోజు చేసిన పనులపై నివేదిక ఇవ్వాలని ఆశా వర్కర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సుజాత, హెల్త్ సూపర్వైజర్ రమణకుమారి, హెల్త్ అసిస్టెంట్లు భాస్కర్ రావు, లక్ష్మీనారాయణ, ఆశా కార్యకర్తలు సమ్మక్క, సబిత, లక్ష్మి, పుణ్యవతి, కవిత, ఊర్మిళ, ఆసుపత్రి సిబ్బంది సుమలత, మనిషా తదితరులు పాల్గొన్నారు.

# ధర్మసాగర్ ఎంఈఓను సస్పెండ్ చేయాలి

● ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి సిపతి వినయ్




**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ధర్మసాగర్ మండలంలో ప్రభుత్వ పాఠశాలల సమస్యల పరిష్కారానికి సంబంధించిన వినతిపత్రాన్ని ఇవ్వడానికి ఏఐఎస్ఎఫ్ మండల సమితి నాయకులు సంబంధిత మండల విద్యా అధికారి (ఎంఈఓ) కార్యాలయాన్ని సందర్శించారు. అయితే ఎంఈఓ అందుబాటులో లేకపోవడంతో అక్కడ ఉన్న సిబ్బందిని వినతిపత్రం తీసుకోవాలని కోరగా, వారు తిరస్కరించారు. ఫోన్ ద్వారా ఎంఈఓతో మాట్లాడినప్పుడు, "నేను లేను, తర్వాత రండి" అంటూ తగిన దృష్టితో స్పందించకుండా వివాదాస్పదంగా మాట్లాడిన తీరు సిగ్గుచేటని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి సిపతి వినయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తదుపరి, కార్యాలయ సమయాల్లో కూడా తాళం వేసి ఉండడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రజాప్రతినిధులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు సమస్యలపై అధికారులను కలవడానికి వచ్చినప్పుడు కనీసం వినతిపత్రం తీసుకునే సన్నద్ధతను కూడా చూపకపోవడం దుర్మార్గమని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో, మండల విద్యాధికారి రాధన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, ఈ వ్యవహారంపై జిల్లా విద్యాధికారి వసంతి వెంటనే స్పందించాలని కోరారు. ఈ సందర్భంగా సిపతి వినయ్ మాట్లాడుతూ జూన్ 12న కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్నందున మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పడిన సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలలలోని కొన్ని ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హై స్కూల్‌లకు ప్రహరీ గోడలు లేకపోవడం, మరమ్మతుల అవసరం ఉండటం వంటి అంశాలపై వినతిపత్రాన్ని తీసుకురాగా, ఎంఈఓ కార్యాలయం మూసివుండటం బాధాకరమన్నారు.

# మా కూతురు పెళ్లికి రండి

## చంద్రబాబును ఆహ్వానించిన టీడీపీ నేత



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో వారి చాంబర్లో కలిసి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైనందున శ్రీ భద్రకాళి అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత చంద్రబాబు నాయుడుకి మా అమ్మాయి వివాహ శుభలేఖ అందజేసి ఈ వివాహానికి తప్పకుండా తమరు హాజరుకావాలని నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరారు. చంద్రబాబు నాయుడుని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి చిలువేరు రవీందర్, పూర్ణచందర్, రాజేందర్ ఉన్నారు.

# బీజేపీ పరకాల రూరల్ మండల కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, పరకాల :** బీజేపీ పరకాల రూరల్ మండల కమిటీని జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి ఆదేశానుసారం మండల అధ్యక్షుడు కాసగాని రాజ్ కుమార్ గౌడ్ బీజేపీ మండల కమిటీని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా ఎం.సంతోష్ రావు, ఏ.మధుకర్ రెడ్డి, డి.పద్మ, ఎస్. భాస్కర్, ప్రధాన కార్యదర్శులుగా జె.రాజేందర్ రావు, జి.నరసయ్య, కార్యదర్శులుగా కె.స్వప్న, పి.నరేష్, కె.వసంత, పి.మల్లారెడ్డి, కోశాధికారిగా ఏ.లింగయ్యలను మండలంలోని వివిధ గ్రామాల నుంచి 35 మందిని మండల కార్యవర్గ సభ్యులుగా నియమించడం జరిగింది. నూతనంగా మండల కమిటీలో నియమితులైన వారందరికీ మండల అధ్యక్షుడు కాసగాని రాజ్ కుమార్ గౌడ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. నూతనంగా నియమితులైన వారందరు పరకాల రూరల్ మండలంలో పార్టీని బూత్ స్థాయి నుంచి పటిష్టం చేస్తూ పరకాల రూరల్ మండలంలో బీజేపీని అభివృద్ధికి కృషి చేస్తారని ఆశిస్తున్నాను.

# మృతుడి కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మండలంలోని కన్నయ్య పల్లె గ్రామంలో మంతపురి మల్లయ్య మరణించగా వారి పార్థివ దేహాన్ని జిల్లా యువజన నాయకులు లోనే శ్రవణ్ కుమార్ సందర్శించి పూలమాల వేయడం జరిగింది. అలాగే మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి ఆర్థిక సహాయం అందజేశారు. నివాళులర్పించిన వారిలో గ్రామ శాఖ అధ్యక్షులు పగిడిపల అశోక్, గ్రామ నాయకులు నలుగురి ఉపేందర్, మంతపురి అనిల్, భాష పాక కుమార్ నివాళులు అర్పించారు.

# బీజేపీ ఆత్మకూరు మండల కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** బీజేపీ ఆత్మకూరు మండల కమిటీని జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి ఆదేశానుసారం మండల అధ్యక్షుడు ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి బీజేపీ మండల కమిటీని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగాపూజారి రవీందర్, బయ్య రమ, పీసాల సాంబయ్య, మామిడిపల్లి శారద, ప్రధాన కార్యదర్శులుగా బయ్య పైడి, రవ్వ శివప్రసాద్, కార్యదర్శులుగా వజ్ర రవికుమార్, బలవంతుల ప్రమీల, తిప్పని రాంబాబు, కోరుకొప్పుల నాగరాజు, కోశాధికారిగా జక్కుల మహేందర్ లను, మండలంలోని వివిధ గ్రామాల నుంచి 35 మందిని మండల కార్యవర్గ సభ్యులుగా నియమించడం జరిగింది. నూతనంగా మండల కమిటీలో నియమితులైన వారందరికీ మండల అధ్యక్షుడు ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

# బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించండి



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు టీఎస్ యూటీఎఫ్ వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట ప్రచార జాత కార్యక్రమాన్ని వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి మామిడి జ్ఞానేశ్వర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన ఉచిత విద్య అందుతుందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడం కోసం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం టీఎస్ యూటీఎఫ్ చేస్తున్న కృషిని అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం కలిగించాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల పై ఉందన్నారు. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు అప్డేట్ అవుతూ సాంకేతికతను ఉపయోగించుకొని నూతన పద్ధతులలో బోధన సాగించాలన్నారు. వేసవి సెలవుల్లో ఇచ్చిన వృత్యంతర శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రంజిత్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత విద్యార్హతలు కలిగిన, వృత్తి నిపుణత గల ఉపాధ్యాయులు పని చేస్తున్నారన్నారు. ప్రైవేటుకు ధీటుగా ఆంగ్ల మాధ్యమంలో బోధనతో పాటు విలువలతో కూడిన విద్యను అందిస్తున్నారని తెలియజేశారు. ఉచిత నిర్బంధ విద్యా హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యాపారీకరణతో పేద, మధ్య తరగతి తల్లిదండ్రులు ఫీజులు భారం మోయలేక సతమతమవుతున్నారన్నారు. ఉచిత విద్యతో పాటు ఉచిత పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ఆటపాటలతో కూడిన కృత్యాధార బోధనతో విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీస్తున్న ప్రభుత్వ పాఠశాలలే ప్రగతికి గీటురాళ్లన్నారు. అన్ని ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించి పిల్లలను ప్రైవేటు తరలకుండా అడ్డుకట్ట వేయాలన్నారు. ఊరు వాడ ఏకమై ఉద్యమంలా కదిలి బడుగు, బలహీన వర్గాల పిల్లలకు విద్యా దూరం కాకుండా ఊరు బడి పరిరక్షణకు నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు డి.కిరణ్ కుమార్, వరంగల్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు తాటికాయల కుమార్, సి.సుజన్ ప్రసాదరావు, ఉపాధ్యక్షులు మేకిరి దామోదర్, మర్రి అన్నాదేవి, కోశాధికారి ఎస్.ఎ.రవూఫ్, కార్యదర్శులు పాక శ్రీనివాస్, కె.రమేష్, తాబేటి కుమారస్వామి, కె.రవీందర్, ఆడిట్ కమిటీ కన్వీనర్ గుండు కరుణాకర్, కెజిబివి కన్వీనర్ టి.రేణుక, జిల్లా కమిటీ సభ్యులు టి.వి.సత్యనారాయణ, బదావత్ శ్రీనివాస్, హరిప్రసాద్, వి.సంపత్, వి.అరవింద్ కుమార్, బి.మల్సూర్, కె.నీలాద్రి, సీతారాం, నరసింహారావు, రాజిరెడ్డి, కుమారస్వామి, శంకర్, రఘురామయ్య, చంద్రశేఖర్, పి.శివప్రసాద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## టీచర్ల సర్దుబాటు ఉత్తర్వులను రద్దు చేయాలి



**వరంగల్ వాయిస్, నడికూడ :** రాష్ట్ర ప్రభుత్వం మిగులు టీచర్లను సర్దుబాటు చేయాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని పీఆర్టీయూ నడికూడ మండల అధ్యక్షుడు అచ్చ సుదర్శన్ డిమాండ్ చేశారు. బడిబాట తర్వాత నమోదైన విద్యార్థుల సంఖ్య ఆధారంగా చేయాల్సిన ఉపాధ్యాయుల సర్దుబాటు బడి బాట ముందు ఎలా చేస్తారని అన్నారు. ప్రాథమిక పాఠశాలలు ప్రస్తుతం ఒకరిద్దరు ఉపాధ్యాయులతో నడుస్తున్నాయని, 60మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు బోధించడం ఎలా సాధ్యపడుతుందన్నారు. ప్రతి పాఠశాలకు ఒక ప్రధాన ఉపాధ్యాయుడు, తరగతి గదికి ఒక ఉపాధ్యాయున్ని కేటాయించకుండా పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులను కూడా సర్దుబాటు పేరుతో ఏకపక్షంగా తీసేయడం వల్ల పాఠశాలలలో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం, గుణాత్మక విద్య సాధ్యపడదని తెలిపారు. జూలై, ఆగస్టు మాసాల్లో చేయాల్సిన సర్దుబాటు కార్యక్రమాన్ని జూన్ నెలలోనే చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఉన్నత విద్యకు పునాది ప్రాథమిక విద్య అని, బలహీన వర్గాల పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అశాస్త్రీయంగా ఉన్న సర్దుబాటు ఉత్తర్వులను రద్దు చేయాలన్నా రు.

## ప్రతి ఇంటికి తాగు నీరు అందిస్తాం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వేసవికాలంలో అనివార్య కారణాల వలన మంచినీటి పైపుల ద్వారా నీరురాని సమయంలో బోరు పంపులు ఎంతో ఉపయోగపడుతున్నాయని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. డివిజన్ లోని ఖరాబు అయిన బోరింగ్ పంపులను కార్పొరేషన్ సిబ్బందిచే కార్పొరేటర్ మరుపల్ల రవి మరమ్మతులు చేయించారు. డివిజన్ లో ప్రతి ఇంటికి మంచినీరు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం కింద ప్రతి ఇంటికి నల్లాలలను అమర్చి ప్రతిరోజు నీటిని విడుదల చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం పైపు లైన్ లేని ప్రాంతాలలో మహానగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా ప్రతిరోజు నీటిని పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. పైపులైన్ లేని ప్రాంతాలను ఇప్పటికే అధికారులు గుర్తించడం జరిగిందని, త్వరలోనే నిధులు మంజూరైన తర్వాత పైప్ లైన్ వేసి నల్లా కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందని కార్పొరేటర్ మరుపల్ల రవి తెలిపారు. మిషన్ భగీరథ పథకం కింద కొందరు పాత ఇండ్లలో ఖాళీ స్థలం ఉన్నవారు నల్ల కలెక్షన్ తీసుకోవడం జరిగిందని, వారు నీటిని ఉపయోగించుకోకుండా వదిలివేయడం వల్ల నీరు అంతా వృధా అవుతుందని అటువంటి వారు వెంటనే పైపులకు ఆన్ ఆఫ్ అమర్చుకోవాలని కార్పొరేటర్ మరుపల్ల రవి కోరారు.

## టీపీసీ సేవాదళ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా బొచ్చు చందర్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :**తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ హనుకొండ జిల్లా అధ్యక్షుడిగా పరకాలకు చెందిన బొచ్చు చందర్ ను నియమించారు. మంగళవారం హనుమకొండ ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డికి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్ కి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్యకి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డికి, రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి సుంకరి శ్రీనివాస్ రెడ్డికి, కాంగ్రెస్ సేవాదళ్ సీనియర్ నాయకులు దాడబోయిన మీరస్వామికి బొచ్చు చందర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పాలకుర్తి శ్రీనివాస్, నిట్టె బాలరాజు, చిన్నాల గోనేల్ పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** సిద్దిపేట శాసనసభ్యుడు, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు పుట్టినరోజు సందర్భంగా కంచనపల్లి గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరం మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో, కందుకూరి ప్రభాకర్ సమన్వయంతో నిర్వహించబడింది. శిబిరాన్ని మాజీ సర్పంచ్ గవ్వని విజయ నాగేశ్వరరావు, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు గుండె జోసెఫ్ ప్రారంభించారు.ఈ వైద్య శిబిరాన్ని రాష్ట్ర నేతలు బక్క నాగరాజు, గద్దల నర్సింగరావు, జిల్లా నేతలు కొమ్ము రాజు, బొల్లం సంపత్ పర్యవేక్షించారు. శిబిరంలో ఉచితంగా బీపీ, షుగర్ వంటి ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, డాక్టర్లతో సంప్రదింపులు ఏర్పాటు చేశారు. అలాగే మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పులు, దగ్గు, దమ్ము, జ్వరం, తలనొప్పి, ఆకలి లేకపోవడం, సర్ది, దురద, బలహీనత వంటి సమస్యలకూ ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు నానాజీ, ప్రభుదాస్, పీఏసీఎస్ డైరెక్టర్ పసుల ఏలియా, జిల్లా నాయకులు తిరుమల్ రెడ్డి, ప్యారపు రాములు, కడుదుల విష్ణు, సాంబరాజు రమేష్, శ్రీనివాస్, కడుదుల రాజు, మాజీ వార్డు మెంబర్లు భాస్కర్, మనోజ్, శ్రీధర్, కొంగరి ఎల్లయ్య, చింతకింది నరసింహులు, గొంగళ్ల ప్రవీణ్, రాజు, కృపానందం, ప్రవీణ్ పాల్గొన్నారు.

## దామెరలో గ్రామ రెవెన్యూ సదస్సు

**వరంగల్ వాయిస్, దామెర:** రెవెన్యూ సదస్సులను మండలంలోని భూ సమస్యలు ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని దామెర ఎమ్మార్వో జ్యోతి వరలక్ష్మి దేవి అన్నారు. మంగళవారం దామెర గ్రామంలో రెవెన్యూ సదస్సును ఏర్పాటు చేసిన సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని అమలు చేస్తున్న భూభారతి చట్టంలో ఆర్ ఓ ఆర్ కానీ రైతుల భూముల యొక్క సమస్యల పరిష్కార దిశగా తీసుకురావడంతో పట్టాలు కానీ భూములు ఉన్నవారు సంబంధిత పత్రాలను అధికారులకు అందించినచో వాటిని పారదర్శకంగా పరిశీలించి రికార్డులలో నమోదు చేస్తామని తెలిపారు. అనంతరం ప్రజల నుండి వచ్చిన భూ సమస్యలకు సంబంధించిన విజ్ఞాపనలను అధికారులు స్వీకరించారు.138 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## చిన్నారిని ఆశీర్వదించిన రామ రాజేష్ ఖన్నా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లా ఫోర్ట్ రోడ్డు ఏకశిలా కమ్యూనిటీ హాలులో చిక్కులపల్లి పృథ్వీరాజ్ –సౌమ్య దంపతుల ప్రథమ పుత్రిక వేదశ్రీ మొదటి జన్మదిన మహోత్సవానికి జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా హాజరై చిన్నారి వేదశ్రీ ని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో సీహెచ్ పృథ్వీరాజ్, ఎంజీఎం హాస్పిటల్ ఎస్ఎన్ సీయూ డేటా ఎంట్రీ ఆపరేటర్ బి.మురళీమోహన్, గూడెపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## భూభారతిపై అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండలంలోని మాదన్నపేట గ్రామంలో మంగళవారం తహసీల్దార్ సురేష్ అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ సదస్సులో, భూభారతి వెబ్సైట్పై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి విధానంతో రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కానీ ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి పథకం ద్వారా రైతుల భూ సమస్యలకు త్వరిత పరిష్కారాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. భూభారతిలో ప్రతి సమస్యకు ఒక స్పష్టమైన పరిష్కారం ఉండటంతో రైతులు దీన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాదన్నపేట మాజీ సర్పంచ్ గుండపు చరణ్ పటేల్, మార్కెట్ డైరెక్టర్ యాకూబ్ పాషా, కాంగ్రెస్ నాయకుడు అబ్బారవేని అనిల్, గ్రామానికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

మంగళవారం, జూన్ 03, 2025

# భూభారతి సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

■ వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పున్నేలు గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సును రెవెన్యూ అధికారులు నిర్వహించారు. ఈ సదస్సును వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సందర్శించారు. భూభారతి రెవెన్యూ సదస్సులో భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు దరఖాస్తు చేస్తున్న తీరును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు దరఖాస్తుదారులతో ఎమ్మెల్యే, కలెక్టర్ మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరించుకునే అవకాశం లభించిందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం జూన్ మూడో తేదీ నుంచి 20వ తేదీ వరకు భూ భారతి రెవెన్యూ సదస్సులను గ్రామాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్ రావు, స్థానిక తహసీల్దార్ విక్రమ్ కుమార్, ఇతర అధికారులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించిన కలెక్టర్ ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, ఐనవోలు:** మండల కేంద్రానికి చెందిన బొల్లెపల్లి మంజుల అనే మహిళ లబ్ధిదారుకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా ఇంటి నిర్మాణ పనులను హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. సదరు మహిళా లబ్ధిదారు కుటుంబ సభ్యులు, అధికారులు, స్థానికుల సమక్షంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఇంటి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణ పనులను వేగవంతంగా నెల రోజుల్లో పూర్తయ్యే విధంగా చూడాలని లబ్ధిదారు కుటుంబ సభ్యులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సూచించిన విధంగా వివిధ దశలకు ఇంటి నిర్మాణ బిల్లులను చెల్లించడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు సంబంధించి ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాలకు సంబంధిత బిల్లు జమ అవుతాయని అన్నారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ శాఖ డీఈ సిద్ధార్థ నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### బియ్యం పంపిణీ పరిశీలన..

ఐనవోలులోని రెండో రేషన్ దుకాణం ద్వారా బియ్యం పంపిణీ జరుగుతున్న తీరును జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పరిశీలించారు. రేషన్ దుకాణానికి ఎన్ని క్వింటాల సన్న బియ్యం వచ్చిందని, ఇప్పటివరకు ఎంత పంపిణీ చేశారని సదరు డీలర్ ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రేషన్ దుకాణం పరిధిలో ఎన్ని కొత్త రేషన్ కార్డులు వచ్చాయని, ఆ కార్డుదారులకు బియ్యం పంపిణీ చేస్తున్నారా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. బయోమెట్రిక్ వేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకుని, స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించారు. రేషన్ దుకాణానికి వచ్చిన కార్డుదారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. బియ్యం రెగ్యులర్ గా తీసుకెళ్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. కార్డుదారుకు బియ్యం తూకం వేసి అందిస్తుండగా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం అందించాలన్నారు. ఇబ్బందులు లేకుండా బియ్యం పంపిణీ జరగాలని డీలర్ కు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల అధికారి కొమరయ్య, స్థానిక తహసీల్దార్ విక్రమ్ కుమార్, ఎంపీడీవో రఘుపతి రెడ్డి, ఇతర అధికారులు,స్థానికులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమం కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

➲ అవగాహన సదస్సులో ఎమ్మెల్యే జీఎస్ఆర్




**వరంగల్ వాయిస్, రేగొండ :** కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే సత్యనారాయణ రావు అన్నారు. నూతన కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో డిప్యూటీ తహసిల్దార్ మహ్మద్ రజాక్ అధ్యక్షతన నిర్వహించిన భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా జాయింట్ కలెక్టర్ అశోక్ కుమార్, భూపాలపల్లి ఆర్డీవో రవి తో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ గతంలో ఉన్న ధరణిలో అనేక లోపాలు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం గుర్తించి ధరణి స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకువచ్చేందుకు మేధావులు, రైతు సంఘాలు, అందరితో చర్చించి గత చట్టంలోని లోపాలను సవరిస్తూ కొత్త చట్టం తీసుకు వచ్చిందన్నారు. లోపభూయిష్టంగా ఉన్న ధరణి వల్ల పట్టాల జారీలో ఏదేని పొరపాటు జరిగితే అప్పీలు చేయడానికి ఆవకాశం లేదని, రైతులు సివిల్ కోర్టు చుట్టూ తిరగాల్సి వచ్చేదని దానివల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరణి స్థానంలో భూ భారతి తెస్తామని చెప్పిన ప్రకారం పటిష్టమైన చట్టాన్ని అమల్లోకి తెచ్చినట్లు తెలిపారు. భూములు కొన్నా, అమ్మినా లైసెన్స్డ సర్వేయర్ ద్వారా హద్దులతో మ్యాపు తయారు చేసి పట్టాదారు పాసు పుస్తకాల్లో నమోదు చేస్తారని తద్వారా భూమి గుర్తింపుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. ఏదేని సందర్భంలో తహసీల్దార్ ద్వారా పొరపాటు జరిగితే ఆర్డీఓ, ఆర్డీఓ నుంచి కలెక్టర్, కలెక్టర్ నుంచి భూ ట్రిబ్యునల్ కు వెళ్లడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఉచిత న్యాయ సహాయ సేవలు అందించడానికి అవకాశం కల్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు ప్రజా ప్రతినిధులు, ఉమ్మడి రేగొండ మండల కాంగ్రెస్ నేతలు, అధికారులు, రైతులు ఉన్నారు..



### భూభారతి చట్టం రైతుల పాలిట వరం..

**వరంగల్ వాయిస్, గణపురం :** సీఎం రేవంత్ తెచ్చిన భూభారతి చట్టం రైతుల పాలిట వరంగా ఉందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని తన సొంత గ్రామం బుద్ధారంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి భూభారతి రెవెన్యూ గ్రామ సదస్సును (3 నుంచి 13 తేదీ వరకు) 9 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించే షెడ్యూల్లో భాగంగా మంగళవారం ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. సదస్సులో తహసీల్దార్ ఏం సత్యనారాయణ స్వామి, ఎంపీడీవోఎల్ భాస్కర్, సొసైటీ ఛైర్మన్లు జి.సత్యనారాయణ రెడ్డి, కే కుమార్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి అశోక్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అధిక దిగుబడులకు నాణ్యమైన విత్తనాలు వాడాలి



**వరంగల్ వాయిస్, గణపురం :** వరి పంటల సాగులో రైతన్నలు నాణ్యమైన విత్తనాలు వాడినప్పుడే అధిక దిగుబడులు వస్తాయని వరంగల్ ప్రాంతీయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఏ సృజన్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి డి.ఐలయ్య అధ్యక్షతన జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరిగిన నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం అనే వినూత్న కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై డాక్టర్ సృజన్ పంట సాగులో నాణ్యమైన విత్తనం యొక్క ఆవశ్యకతపై ఆయన సోదాహరణగా వివరించారు. అనంతరం ప్రభుత్వ పక్షాన పలువురు రైతులకు వ్యవసాయ అధికారులు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ కె కుమార్ యాదవ్, జి.సత్తిరెడ్డి, రైతు నాయకులు ఎస్.బాబురావు, ఏ.సంపత్ రావు, వి.అశోక్ రెడ్డి, కె.వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



**వరంగల్ వాయిస్,శాయంపేట :** మండలంలోని పత్తిపాక గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో భాగంగా రైతుల నుంచి మొత్తం 153 దరఖాస్తులు భూసమస్యపై వచ్చిన వాటిని తీసుకొని వారికి రిసిప్ట్ ఇవ్వడం జరిగింది. మొత్తం దరఖాస్తులను కార్యాలయంలో మరి కొంత మంది సిబ్బంది రైతులు ఏ కారణం చేత దరఖాస్తు చేసు కొన్నారనే విషయం పరిశీలించి దరఖాస్తు పెట్టుకున్న వాళ్లకు అందరికీ మొదట నోటీస్ లు ఇవ్వడం జరుగు తుంది. ఈ గ్రామ సభకు పరకాల ఆర్డీఓ డాక్టర్ నారాయణ, మండల తహసీల్దార్ సత్యనారాయణ, డీటీ ప్రభావతి, ఇద్దరు రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం



**వరంగల్ వాయిస్, నడికూడ :** పంట సాగులో నాణ్యమైన విత్తనం యొక్క పాత్రను గుర్తించి అధిక దిగుబడులను సాధించేందుకుగాను ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ అర్చన ఆధ్వర్యంలో మండల కేంద్రం రైతు వేదికలో మంగళవారం రోజున నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పంటలో నాణ్యమైన విత్తనాన్ని వాడినప్పుడు దిగుబడులు 10 నుంచి 15 శాతం పెరిగే అవకాశాన్ని రైతులకు వివరించారు. పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి రైతులకు విత్తన ప్యాకెట్లను పంపిణీ చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలతో జూన్ 2న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభించబడిందని అన్నారు. విత్తన సాంకేతికతను గ్రామస్థాయికి తీసుకెళ్లడం ద్వారా రానున్న రెండు మూడు సంవత్సరాలలో ప్రతి గ్రామం విత్తన స్వయం సమృద్ధిని సాధించడమే కాక తెలంగాణ రాష్ట్రాన్ని విత్తన భద్రతలో దేశానికి ఆదర్శంగా నిలిపే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పోరిక జై సింగ్, ఏఎంసీ డైరెక్టర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రశాంత్, ప్రదీప్, రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ కాపీలు అందజేత




**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** పేద బడుగు బలహీన వర్గాలను గుర్తించి, అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇండ్లను అందజేయడమే లక్ష్యంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి చొరవ తీసుకొని అందజేస్తున్నట్లు మాజీ పీఏసీసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్ అన్నారు. మంగళవారం ఆత్మకూరు మండలం తిరుమలగిరి గ్రామంలో అర్హులైన వారికి ఇందిరమ్మ ప్రొసిడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లను అందజేస్తామన్నారు. జిల్లాలోని పరకాల నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ముందుకు దూసుకుపోతున్నారన్నారు. గత ప్రభుత్వాలు ఇండ్లు ఇస్తానని నిరుపేదలను మోసం చేసిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బూర రాజేందర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోరే బాలకృష్ణ, మాజీ ఉపసర్పంచ్ గడ్డి రమా కుమారస్వామి, పంచాయతీ కార్యదర్శి అనూష, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలపై కమిషనర్ కు వినతి



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని 9వ వార్డులో డ్రైనేజీ, రోడ్ల సమస్యను పరిష్కరించాలని పరకాల మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్ కు మంగళవారం 9వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణ చారి ఆధ్వర్యంలో కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ పూర్ణ చారి మాట్లాడుతూ గతంలో పరకాల పట్టణంలోని శ్రీనివాస కాలనీ వర్షాలతో తీవ్ర ఇబ్బందులు గురయ్యామని గుర్తు చేశారు. స్థానిక ఎమ్మెల్యేతో మొరపెట్టుకుంటే దామర చెరువు మత్తడి కాల్వ నిర్మాణం చేపట్టామని దానిలో చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారు చెత్తాచెదారం వేయడంతో మత్తడి కాలువ పూడికతో డ్రైనేజీ నీళ్లు పోకుండా ఉందని, దానిని మున్సిపల్ కమిషనర్ చెత్తాచెదారంతో ఉన్న మత్తడి కాలువను క్లీన్ చేయాలని కోరారు. అదేవిధంగా సైడ్ డ్రైనేజీలను కూడా త్వరగా పూర్తిగా క్లీన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూర వెంకటేశ్వర్లు, వావిలాల రాజయ్య, సామల భిక్షపతి, రమేష్, శ్యామ్, వెంకట్రాజం, భిక్షపతి యాదవ్, శ్రీనివాస్ , సుధీర్, రాజన్న, పవన్ , నరేష్ , వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# విద్యుదాఘాతంతో మహిళ మృతి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణంలోని మున్సిపాలిటీ ఆఫీస్ సమీపంలో ఓ ఇంట్లో మంగళవారం బట్టలు దండంపై ఆరేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో ఓరుగంటి శైలజ (35) అనే మహిళ మృతి చెందింది.

# బాధిత కుటుంబాలకు పరామర్శ



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని ఓగ్లాపూర్ గ్రామానికి చెందిన కనుకుంట్ల స్వరూప, సీతారాంపురం గ్రామానికి చెందిన బూసా కుమారస్వామి ఇటీవల మరణించగా వారి కుటుంబాలను బీజేపీ రాష్ట్ర నాయకుడు, పరకాల నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. మండల అధ్యక్షులు వేల్పుల రాజ్ కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పావుడాల మధుకర్, మండల ప్రధాన కార్యదర్శి సూర చందర్, కనుకుంట్ల లక్ష్మణ్ రావు, శక్తి ఇంచార్జి గండు పరశురాం, సీతారాంపురం బూత్ అధ్యక్షులు మైల శేషు, కావటి శ్రీకాంత్, ముప్పు ధనుంజయ, మేడిపల్లి రవీందర్, కనుకుంట్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యం

- రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం
- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**వరంగల్ వాయిస్, రాయపర్తి :** మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం పంపిణి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని, నిరుపేద కుటుంబాలైన నిజమైన లబ్ధిదారులకు పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలు యశస్విని ఝాన్సీ రెడ్డి పట్టాలు అందజేశారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి, మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి భారీ ర్యాలీని తీసి ఘన స్వాగతం పలికారు. ఎన్నికలలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ప్రభుత్వం పట్టాలు ఇస్తున్నందున లబ్ధిదారులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రజా ప్రభుత్వంపై విశ్వాసం పెరిగిందని పనితీరును ప్రశంసిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న పేద ప్రజలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో ఇప్పుడు 3500 ఇండ్లు నిరుపేద





కుటుంబాలకు పంపిణీ చేస్తున్నామని రానున్న రోజుల్లో అర్హులందరికీ ఇండ్లు అందిస్తామని తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ..

**వరంగల్ వాయిస్, తొర్రూరు:** పెద్దవంగర మండల కేంద్రంలోని రైతు వేదికలో, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నీరు పెదలైన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని లబ్దిదారులకు పట్టాలు అందజేసి కన్నీరు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ ఇల్లు అనేది ప్రతి పేద కుటుంబానికి ఒక ఆశ్రయం.. తలదాచుకునే చోటు కలగడం ద్వారా వారి జీవితం లో స్థిరత్వం కలుగుతుందన్నారు. రైతు వేదిక ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్యనాయకులు, గ్రామస్థాయి నేతలు, లబ్దిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టాలు అందుకున్న లబ్దిదారులు తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. స్వంత ఇల్లు కలగాలని ఎదురుచూస్తున్న తమ కలను నెరవేర్చినందుకు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# పేదల సొంతింటి కల నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి:** పేద ప్రజలకు గూడు నీడ కల్పించడం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని, ఇందిరమ్మ ఇండ్లతో సొంతంటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. హసన్ పర్తి మండలంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ పేదవారి ఆత్మగౌరవం ప్రతీక సొంత ఇల్లు అని, తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇంటి స్థలం భూమి పత్రాలు ఉన్న పేదలకు మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు నాలుగు దశలలో ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందుతుందని, 400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగుల లోపు ఇంటి నిర్మాణం చేసుకోవాలని తెలిపారు. నాలుగు దశలలో ఆర్థిక సాయం అందుతుందని బేస్ మెట్ నిర్మాణం పూర్తయిన తర్వాత లక్ష రూపాయలు, గోడలు నిర్మిస్తే లక్ష రూపాయలు, స్లాబ్ నిర్మించిన తర్వాత రెండు లక్షల రూపాయలు ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని అన్నారు. ష్ట్రాన్ని గత ప్రభుత్వం అప్పుల కుప్పలుగా మార్చినా మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధిలో తీసుకెళ్తున్నారని కొనియాడారు. ప్రభుత్వం వచ్చిన 15 నెలల్లోనే ఇండ్లు పత్రాలు పంపిణీ చేస్తున్నామన్నారు, ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ విద్యాలత, పీడీ రవీందర్ నాయక్, సిద్ధార్థ నాయక్, ఏఈ నరేంద్ర రాజ్, ఎండీఓ కర్ణాకర్ రెడ్డి, డాక్టర్ పులి అనిల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోరెడ్డి మహేందర్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ తంగళ్లపల్లి తిరుపతి, వీసం సురేందర్ రెడ్డి, 66వ డివిజన్ అధ్యక్షులు కనపర్తి కిరణ్, రెండవ డివిజన్ అధ్యక్షుడు పొన్నాల రఘు, 55వ డివిజన్ అధ్యక్షులు గడ్డం శివరాం ప్రసాద్, మహిళా మండల అధ్యక్షురాలు జోర్కపూల, ఉపాధ్యక్షురాలు బత్తల స్వాతి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ బిగుల్లా సురేష్ పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని విస్మరించిన కాంగ్రెస్

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఈ నెల 12న విద్యా సంవత్సరం పున ప్రారంభం అవుతున్నందున హనుమకొండ మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయని కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో విద్యాశాఖ, ప్రభుత్వం విఫలమైందని ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు జక్కుల భాను ప్రసాద్ అన్నారు. పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని హనుమకొండ మండల ఎంఈఓకి వినతి పత్రం ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు జక్కుల భాను ప్రసాద్ అందజేసి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు కోటలు దాటుతున్నాయని, ఆచరణలో మాత్రం అడుగు కూడా వెయ్యడం లేదని విమర్శించారు.. మండల కేంద్రంలో మరమ్మతులకు నోచుకోలేని పాఠశాలలు ఉన్నాయని ప్రభుత్వ ప్రైమరీ స్కూల్స్, అప్పర్ ప్రైమరీ స్కూల్స్, హై స్కూల్స్ ఇలా సబ్జెక్టు అనుగుణంగా టీచర్స్ లేరని, దానివల్ల విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. మండల కేంద్రంలో మర్కాజి, ఎల్బీహెచ్ఎస్, ప్రాక్టీసింగ్ లాంటి పేరు ఉన్న ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కరువయ్యాయని వాటిపై దృష్టి సారించి తక్షణం జిల్లా విద్యాధికారి పరిష్కరించి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.



మరికొన్ని పాఠశాలలో కిటికీలకు జాలీలు , వాటర్ సదుపాయం, విద్యార్థుల సంఖ్య కనుగుణంగా వాష్రూమ్స్, లేని కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే దుర్మార్గమైన పరిస్థితులు హనుమకొండ మండల కేంద్రంలో కొన్నిచోట్ల నెలకొన్నాయన్నారు. వాటిని జిల్లా విద్యాధికారి దృష్టిసారించి పరిష్కరించాలని, విద్యా సంవత్సరం పాఠశాలలో మెయింటెనెన్స్ కోసం ప్రభుత్వం గ్రాండ్స్ విడుదల చేయాలని కోరారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకురాలు బొజ్జు జ్యోతి పాల్గొన్నారు.

# అందాల ఆరబోతపై నెటిజన్ల ట్రోల్

### ఘాటుగా సమాధానం ఇచ్చిన మాళవికా మోహనన్

ఈ రోజుల్లో అందాల ముద్దుగుమ్మలు గ్లామర్ షో చేయడం మనం చూస్తూనే ఉన్నాం. సినిమా ఆఫర్స్ తగ్గిన సమయంలో నిత్యం అందాలు ఆరబోస్తూ రచ్చ చేస్తున్నారు. అయితే గ్లామర్ షో సమయంలో కొందరు దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు చేస్తుంటారు. ఈ క్రమంలోనే ఓ ముద్దుగుమ్మని దారుణంగా ట్రోల్ చేయడంతో ఆమె ఇచ్చిన సమాధానం అందరిని ఆశ్చర్యపరిచింది. నేను ఒక్క దానినే అందాలు ఆరబోయడం లేదు.. మిగతా హీరోయిన్స్ కూడా అదే చేస్తున్నారంటూ కామెంట్ చేసింది. ప్రస్తుతం ఈ అమ్మడి కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. మలయాళం, తమిళం, తెలుగు చిత్రాల్లో నటిస్తూ తన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మాళవిక మోహనన్ నెటిజన్ల ట్రోల్స్‌కు గట్టిగా సమాధానం ఇచ్చింది. 2011లో మలయాళ సినిమా ద్వారా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన ఈ మలయాళీ ముద్దుగుమ్మ ఇప్పటివరకు 60పైనే సినిమాల్లో కథానాయికగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా నటించి పేరు తెచ్చుకుంది. ఇటీవల ఈ భామ నటించిన రెండు మలయాళ చిత్రాలు తంకమణి , వన్స్ అపాన్ ఏ –టైమ్ ఇన్ కొచ్చి విడుదలై మంచి గుర్తింపును తీసుకువచ్చాయి. వరుస సినిమా ఆఫర్స్‌తో ఫుల్ జోరులో ఉన్న ఈ ముద్దుగుమ్మ అందాల వడ్డింపులో ఏ మాత్రం కాంప్రమైజ్ కావడం లేదు. తరచు తన గ్లామర్ షోతో రచ్చ చేస్తూనే ఉంటు–ంది. అయితే దీనిపై కొందరు నెటిజన్స్ ట్రోల్ చేశారు. అవకాశాల కోసమే మాళవిక అలా తన బాడీ చూపించుకుంటుందని కొందరు కామెంట్స్ చేశారు. దీని గురించి తాజాగా స్పందించిన మాళవిక మీనన్.. నేను ఎప్పుడు కూడా ఛాన్స్‌ల కోసం గ్లామర్ షో చేయలేదు. అయిన అందాలు చూపించడంలో తప్పేంటి. మలయాళ చిత్రాలలో ఎక్స్‌పోజ్ చేసే ఛాన్స్ ఉండదు. తెలుగు, తమిళ భాషలలోనే అలా నటించవచ్చు. ముఖం చూపించకుండా సోషల్ మీడియాలో నా గురించి రాసే వారిని నేను పట్టించుకోను. అయిన నేను ఒక్క దానినే గ్లామర్ ఫొటోలు షేర్ చేయడం లేదు, చాలా మంది హీరోయిన్స్ అలానే చేస్తున్నారు అని పేర్కొంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.





# పవన్ అభిమానులకు మరో శుభవార్త

### త్వరలోనే ఉస్తాద్ భగత్‌సింగ్ షూటింగ్

దాదాపు రెండేళ్ల క్రితం మేనల్లుడు సాయి దుర్గా తేజ్ తో కలిసి 'బ్రో అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. జూలై 28, 2023లో ఈ విడుదల అయ్యింది. ఆ తరువాత మళ్ళీ స్క్రీన్ మీద కనిపించలేదు పవన్. అయితే 'హరి హర వీరమల్లు'తో ఈ నెల 12న థియేటర్లలోకి రానున్నారు. మరోవైపు తాను కమిట్ అయిన ఓజీ చిత్ర షూటింగ్ కూడా శరవేగంగా జరిగేలా ప్లాన్స్ చేసుకున్నారు పవన్ .ఇప్పటికే ఓజీ చిత్ర రిలీజ్ డేట్ కూడా ప్రకటించారు. సెప్టెంబర్ 25న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుందని ఇటీవలే పోస్టర్ ద్వారా తెలియజేశారు. ఇక పవన్ కమిటైన మరో చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. ఈ సినిమా ఎప్పుడు సెట్స్ పైకి వెళుతుందా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా గమనిస్తూ వస్తున్నారు. ఎట్టకేలకి దీనిపై హరీష్ శంకర్ క్లారిటీ– ఇచ్చారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ప్రముఖ సినీ దర్శకుడు హరీశ్ శంకర్ మంగళవారం ఉదయం విఐపి విరామం సమయంలో దర్శించుకున్నారు. స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో హరీశ్ శంకర్ మాట్లాడుతూ... జూన్ రెండవ వారంలో ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా షూటింగ్ ప్రారంభం కానుందని తెలియజేశారు. సినిమా షూటింగ్ ప్రారంభానికి ముందు స్వామివారి ఆశీస్సులు కోసం తిరుమలకు వచ్చామని హరీష్ తెలియజేయడంతో పవన్ అభిమానుల ఆనందానికి అవధులు లేవు.





# 'కుబేర' నుంచి 'అనగనగా కథ' సాంగ్

శేఖర్ కమ్ముల డైరెక్షన్ లో వస్తున్న కుబేర ప్రమోషన్లలో జోరు పెంచేశారు. నాగార్జున, ధనుష్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాపై అంచనాలు బాగానే ఉన్నాయి. ఇప్పటికే భారీ ఈవెంట్ కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా మూవీ గురించి చాలా విషయాలను పంచుకున్నారు. తాజాగా మూవీ నుంచి 'కుబేర' నుంచి 'అనగనగా కథ' సాంగ్ ను రిలీజ్ చేశారు. ఇందులో నాగార్జున, ధనుష్‌పైనే సాంగ్ సాగుతోంది. ఈ పాట ఒకింత ఆలోచించే విధంగానే కనిపిస్తోంది. రెండు పాత్రల స్వభావాలను, వారి పరిస్థితులను ఇందులో వివరించబోతున్నారు. రష్మిక ఇందులో హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పటికే వచ్చిన ట్రైలర్ బాగానే ఆకట్టు–కుంది. ఇందులో ధనుష్ పాత్ర ఇం–టె–స్టింగ్ గా ఉంది. శేఖర్ కమ్ముల సినిమా అంటేనే ఒకింత డిఫరెంట్ గా, భావోద్వేగాలను తట్టి లేపేవిగా ఉంటాయి. ఈ సారి కూడా అలాంటి భావోద్వేగాల నేపథ్యంలోనే మూవీని తెరకెక్కిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ సినిమా జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నాడు. అనగనగా కథ పాటను చంద్రబోస్ లిరిక్స్ అందించగా.. హైడ్ కార్తి, కరీముల్లా పాడారు. ఈ సినిమాలో నాగార్జున, ధనుష్ పాత్రలు చాలా డిఫరెంట్ గా ఉండబోతున్నాయి. వీరిద్దరి కాంబోలో వస్తున్న మొదటి మూవీ కావడంతో అటు తమిళంలో, ఇటు తెలుగులో ఆసక్తిని రేపుతోంది. వారం ముందు వీరమల్లు, వారం తర్వాత కన్నప్ప సినిమాలు రాబోతున్నాయి. అయినా సరే మూవీని భారీ పోటీ నడుమ రిలీజ్ చేస్తున్నారు.

# ప్రభాస్ అభిమానులకు ఇక పండగే

### 16న రాజాసాబ్ టీజర్ విడుదల

ప్రభాస్ అభిమానులకు ఇక పండగే. త్వరలోనే శుభవార్త అంటూ వార్తలు వస్తున్నాయి. కథానాయకుడిగా మారుతీ దర్శకత్వంలో రూపొందుతున్న రొమాంటిక్ కామెడీ హారర్ ఫిల్మ్ 'ది రాజా సాబ్' భారీ అంచనాల మధ్య రానున్నది. ఈ మూవీ అప్‌డేట్ గురించి అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా నిర్మాణ సంస్థ అప్‌డేట్‌ను పంచుకుంది. ఈ సినిమా టీజర్ జూన్ 16న రానున్నట్లు తెలిపింది. అలాగే డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ ఓ పోస్టర్‌ను పంచుకుంది. ప్రభాస్ మొదటిసారి హారర్ నేపథ్యంలో ఉన్న కథలో నటిస్తుండటంతో అందరి దృష్టి 'ది రాజాసాబ్' పైనే ఉంది. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధికుమార్, సంజయ్‌దత్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన వీడియోలు, పోస్టర్‌లు సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేశాయి. రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తూ దర్శకుడు మారుతీ పోస్ట్ పెట్టారు. 'మీ అందరకీ ప్రామిస్ చేసినట్లే మీరు కోరుకున్నట్లు– ప్రభాస్‌ను బిగ్‌స్క్రీన్‌పై చూస్తారు. ఆరోజు అభిమానులకు పండగే. మీలో జోష్ నింపేందుకు మరిన్ని అప్‌డేట్స్ రానున్నాయి' అని క్యాప్షన్ పెట్టారు. మారుతి – ప్రభాస్ కాంబోలో వస్తోన్న తొలి చిత్రమిది. తమన్ ఇప్పటికే ఈ సినిమాలో నాలుగు పాటలు పూర్తి చేసినట్లు ఆయన చెప్పారు. వైవిధ్యమైన థీమ్స్‌తో వీటిని డిజైన్ చేసినట్లు– వెల్లడిరచారు.






# మేడారంలో శాశ్వత పనులు

- అన్ని శాఖలు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి
- భారీ వర్షాల కారణంగా ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలి
- సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సులు నిర్వహించాలి
- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క

**వరంగల్ వాయిస్, ములుగు :** వచ్చే సంవత్సరం (2026) జరగనున్న మేడారం మహాజాతను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క జిల్లా అధికారులను ఆదేశించారు. వర్షాకాలం రాబోతున్నందున ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణ కొరకు ముందస్తు చర్యలు చేపట్టాలని, జిల్లాలో ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి సీతక్క మేడారం మహా జాతర, భారీ వర్షాలను పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్ పి శబరిష్, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, డీఎఫ్ఓ రాహూల్ కిషన్ జాదవ్, జిల్లా అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ లతో కలిసి జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గత మేడారం జాతరలో విధులు నిర్వహించిన జిల్లా అధికారులు నేటికీ జిల్లాలో వివిధ విభాగాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్నారని, జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే రూ.33 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని, రానున్న రోజుల్లో జాతరలో శ్వాశత పనులను నాణ్యతతో పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ను ఆదేశించారు. ముఖ్యంగా జాతర సమయంలో మేడారంలోని పరిసరాలు అపరిశుభ్రంగా మారకుండా భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. పూర్తిస్థాయిలో మరుగుదొడ్లను ఏర్పాటు చేయడంతో పాటు నిరంతరం మంచినీటి సరఫరా జరగాలన్నారు. గద్దెల ప్రాంతంలో భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా పోలీసు యంత్రాంగం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని, భక్తులు సులభతరంగా దర్శనాలు ముగించుకునే విధంగా క్యూ లైన్ లు, వాటిపై షేడ్ ఏర్పాట్లు చేయాలన్నారు.




రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్న నేపథ్యంలో గ్రామాల్లోని కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, నీరు ప్రవహించే కాలువలలోని గుర్రపు డెక్క తొలగించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. గత వర్షాకాలంలో జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రాణాలతో సిద్ధం చేసుకుని పలు చర్యలు తీసుకోవడంతో ఏలాంటి ప్రాణ నష్టం జరగలేదన్నారు. జిల్లా కేంద్రం నుంచి ఏటూరునాగారం వరకు గల జాతీయ రహదారి ఇరువైపుల గల చెట్లను అటవీ శాఖ, ఆర్ అండ్ బి సిబ్బంది పర్యవేక్షించాలని, అందులో బలహీనమైన చెట్లను గుర్తించి వాటిని తొలగించాలన్నారు. జిల్లాలోని లోతట్టు గ్రామాలు, ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజారక్షణ దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వరద ప్రభావంతో రహదారులు దెబ్బతినకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, ప్రజలకు తాగునీరు, ఆహారం పంపిణీపై దృష్టి సారించాలన్నారు. గత అనుభవాల దృష్ట్యా అధికారులు సమన్వయంతో పని చేసి జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఆదేశించారు. మండల అధికారులు సమన్వయంతో పని చేయాలని, మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. గోదావరి, జంపన్న వాగు వద్ద నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ముందస్తు చర్యల్లో భాగంగా అందరినీ అప్రమత్తం చేయాలన్నారు. భారీ వర్షాలు, మేడారం మహా జాతరను జిల్లా యంత్రాంగం సవాల్ గా స్వీకరించి అప్రమత్తంగా ఉండాలని మంత్రి సీతక్క సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ పీ రవీందర్, ఆర్డీఓ వెంకటేష్, జిల్లా అధికారులు, మండల అధికారులు, మేడారం పూజారులు, తదితరులు పాల్గొన్నారు.

### జేడీ మల్లంపల్లి మండలం ఏర్పాటు..

ప్రజల ఆకాంక్ష మేరకు మల్లంపల్లి మండలాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా, తమ అభిమాన నాయకుడైన జగదీష్ పేరు మీద జేడీ మల్లంపల్లి పేరు పెట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు స్వర్గీయ కుసుమ జగదీశ్ (జేడీ) తల్లిదండ్రులను మంత్రి సీతక్క శాలువా కప్పి సన్మానించారు. జేడీ మల్లంపల్లి బోర్డులను మంత్రి సీతక్క ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్, మండల గ్రామ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# హరిత వనాల పెంపకంలో భాగస్వాములు కావాలి

### కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**వరంగల్ వాయిస్, వరంగల్ :** హరిత వనాల పెంపకంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం హరిత మహోత్సవం 2025 సంవత్సరాలకు సంబంధించిన జిల్లా పరిధి మానిటరింగ్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డీఎఫ్ఓ అనుజ్ అగర్వాల్ పాల్గొని జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2025, 2026 సంవత్సరానికి గాను లక్ష్యాలను సాధింపులపై వివిధ శాఖల జిల్లా అధికారులతో మాట్లాడుతూ వారి శాఖల లక్ష్యాల సాధింపులపై కార్యాచరణ ప్రణాళికను మూడు రోజుల్లో తయారుచేసి నివేదికల సమర్పించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. హరితవనాల పెంచడంతో పర్యావరణ సమతుల్యతను కాపాడడం, వానలు వాపస్ వచ్చేలా చేయడం, వాతావరణంలో ప్రాణవాయువును పెంచడం, కోతులకు పక్షులకు ఆహారాన్ని సమకూర్చేలా హరితవనాలను పెంచి జీవకోటికి మనుగడకు మొక్కలు పెంచడం ఎంతో అవసరం అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ డీఓ కౌసల్య దేవి, జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, జేడీ అగ్రికల్చర్ అనురాధ, డీసీఓ నీరజతో పాటు సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**వరంగల్ వాయిస్, వరంగల్ :** బల్దియా పరిధి 53వ డివిజన్ లోని మహాత్మనగర్ ప్రాంతంలో కార్పొరేషన్ సాధారణ నిధులు రూ.30 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్, డ్రైన్ నిర్మాణ పనులతోపాటు హన్మంతరావు నగర్ లో బల్దియా జనరల్ ఫండ్ నిధులు రూ.15 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు, 54 వ డివిజన్ పరిధిలోని సగర కాలనీలో రూ.33 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంఖుస్థాపన చేశారు. వంద రోజుల కార్యక్రమంలో భాగంగా 53వ డివిజన్ లో క్షేత్ర స్థాయిలో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. పరిష్కరించుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. అనంతరం నిర్వహించిన స్వచ్ఛ ప్రతిజ్ఞలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లు గుంటి రజిత శ్రీనివాస్, సోదా కిరణ్, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.






# చోరీలపై ఫోకస్ పెట్టండి

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

**వరంగల్ వాయిస్, క్రైం :** చోరీల నియంత్రణపై ప్రతి పోలీస్ అధికారి ఫోకస్ పెట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అధికారులకు పిలుపు నిచ్చారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని మంగళవారం సీపీ కార్యాలయములో నిర్వహించారు. వరంగల్ కమిషనరేట్ చెందిన పోలీస్ అధికారులు పాల్గొన్న ఈ సమీక్షా సమావేశంలో ముందుగా ఆస్తి, నేరాలపై సమీక్షించారు. ఇందులో ప్రధానంగా పెండింగ్ చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్, సోమ్ము రికవరీ సమీక్షించి కేసుల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకై సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. నేరాలకు సంబంధించి అధికారులు దర్యాప్తు సమయంలో టెక్నాలజీతో పాటు శాస్త్రీయ పద్ధతిలో దర్యాప్తు చేపట్టాలని, చోరీలపై పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించాలని, ముఖ్యంగా వాహనాల చోరీలకు సంబంధించి వాహనాలను ఇంటిలో పార్కింగ్ చేసుకునే విధంగా ప్రజలకు సూచించాలని సీపీ తెలిపారు. బక్రీద్ పండుగను దృష్టిలో పెట్టుకొని మూగజీవాల రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు, పండుగ వేళ దర్గాల వద్ద పటిష్ఠమైన పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, అంకిత్‌కుమార్, జనగాం ఏఎస్పీ చైతన్య, అదనపు డీసీపీలు రవి, సురేష్‌కుమార్‌తో పాటు ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com